క్లుప్తంగా

నగర మాల సంఘం కమిటీ



నిజామాబాద్ నాగారం : నగర మాల సంఘం కమిటీని శనివారం ఆర్అండ్బీ గెస్ట్హౌస్లో సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా సక్కి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి గైని దయాసాగర్, కోశాధికారి మధుకర్, ఉపాధ్యక్షులు పోశెట్టి, శోభన్, సహాయ కార్యదర్శులు సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, సభ్యులు సుశీల్కుమార్, మహేశ్, లింగం, పోశెట్టి, సలహాదారులు నీలగిరి రాజు, బాలరాజు తదితరులున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



నిజామాబాద్ సిటీ : నగరంలోని 56వ డివిజన్ అహ్మద్పుర కాలనీలో శనివారం మేయర్ దండు నీతూకిరణ్ సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అహ్మద్పుర కాలనీలో పట్టణ ప్రగతి కింద రూ. 10 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు మేయర్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ బిగాల పార్టీలకు అతీతంగా అన్ని డివిజన్లకు నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భారీ భాయ్, అయూబ్, అహ్మద్పుర కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



ఇందల్వాయి : ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ ప్రకటించినందున సీఎం కేసీఆర్, టీఎస్ ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటాలకు శనివారం పాలకవర్గం, ఉద్యోగులు పాలాభిషేకం చేశారు. సొసైటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ మారుతీ, డైరెక్టర్లు పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి



డిచ్పల్లి : శిక్షణ పూర్తి చేసుకున్న వీవోఏ లు గ్రామాల్లోకి వెళ్లి స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై పూర్తి అవగాహన కల్పించాలని కామారెడ్డి డీపీఎం రవీందర్రావు సూచించారు. డిచ్పల్లి మండల కేంద్రంలోని ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో వీవోఏ లకు ఆర్థిక అక్షరాస్యత పై గత 6 రోజులుగా నిర్వహించిన ఉచిత శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. కోర్సు కోఆర్డినేటర్స్ రామకృష్ణ, భాగ్యలక్ష్మి, రంజిత్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



నిజామాబాద్ కల్చరల్ : స్వామియే శరణమయ్యప్ప నామస్మరణతో శనివారం ఇందూరు అయ్యప్పస్వామి మందిరంలో ఆలయ అర్చకులు రమేష్శర్మ ఆధ్వర్యంలో మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్రనాయకులు ధన్పాల్ సూర్యనారాయణగుప్తా మాట్లాడుతూ మహాపడిపూజ అయ్యప్పస్వామి భిక్ష భక్తులకు అందజేసినట్లు తెలిపారు. గురుస్వాములు ధనుంజయ్గుప్తా, ఆగమయ్య గుప్తా, పార్శి రాజేందర్ గుప్తా, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమంలో విజయ్, శివచరణ్, అనిత భక్తిగీతాలు ఆలపించారు.

న్యూ ఇయర్కు వెల్కం..



2023 ఆంగ్ల నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు నగరవాసులు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి నగరంలోని నెహ్రూపార్క్, రైల్వేస్టేషన్, వినాయక్నగర్ ప్రాంతాలు సందడిగా మారాయి. ప్రజలు కేక్లు, చికెన్ వంటకాలు విరివిగా కొనుగోలు చేశారు. కేక్ కట్ చేసి 2022కు ఘనంగా వీడ్కోలు పలికి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



నెహ్రూపార్క్ వద్ద కేక్లు కొనుగోలు చేస్తున్న నగరవాసులు





నెహ్రూపార్క్ వద్ద చికెన్ రోటీలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



రైల్వేస్టేషన్ వద్ద పూలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్



నగరంలోని ఓ విద్యాసంస్థలో హైస్కూల్లో విద్యార్థుల హంగామా

పడకల్లో అయ్యప్ప స్వాముల ర్యాలీ



పడకల్లో ఆందోళన చేస్తున్న అయ్యప్ప స్వాములు

జక్రాన్పల్లి : అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జక్రాన్పల్లి మండలంలోని పడకల్లో అయ్యప్ప స్వాములు నిరసన ర్యాలీ చేపట్టారు. గ్రామ ప్రధాన కూడలిలో ఆందోళన చేశారు. గ్రామంలోని పురవీధుల గుండా తిరుగుతూ నరేశ్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బైరి నరేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సోం నర్సారెడ్డి, పుప్పాల శ్రీనివాస్, దత్తాద్రిగౌడ్, బోండ్ల అరుణ్, వొల్కాజీ దిలీప్, పోశెట్టి, కాశీరాం, అప్కా సత్యం, నాగరాజు, అజయ్, నవీన్, వంశీ, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో..

ఖలీల్వాడి : హిందూ దేవుళ్లు, అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం నగరంలోని వివిధ పోలీస్స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. బైరి నరేష్, రెంజర్ల రాజేశ్లపై ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్లో జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్ గౌడ్, మూడవ పోలీస్ స్టేషన్లో న్యాయవాది, బీజేపీ లీగల్ సెల్ సంయుక్త కన్వీనర్ ఉదయ కృష్ణ, నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో న్యాయవాది, బీజేపీ రూరల్ కన్వీనర్ బిట్ల రవి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మూడో టౌన్లో ఫిర్యాదు చేస్తున్న న్యాయవాదులు

పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలు



కిడ్స్పార్క్ స్కూల్లో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు



సత్యశోధక్ పాఠశాలలో..

సిరికొండ : మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కిడ్స్పార్క్ పాఠశాలలో కేక్కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. సత్యశోధక్ పాఠశాలలో వెల్కం–2023 ఆంగ్ల అక్షరమాల ఆకారంలో విద్యార్థులు కూర్చొని నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



డిచ్పల్లి : పశువుల ఆరోగ్యంపై యజమానులు ఎప్పటికప్పుడు తగిన శ్రద్ధ చూపాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బాలి గ్ అహ్మద్ సూచించారు. పశు సంవర్ధక శాఖ, క్రిబ్కో ఫెర్టిలైజర్స్ సహకారంతో డిచ్పల్లి మండలం అమృతాపూర్లో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 60 గేదెలకు గర్భకోశ సంబంధిత నివారణ చికిత్స నిర్వహించారు. సర్పంచ్ కులాచారి లత నర్సింగ్రావు, ఎంపీ టీసీ సాయిలు, గోపికృష్ణ, డాక్టర్ గంగాప్రసాద్, క్రిబ్కో సేల్స్ మేనేజర్ సిద్ధార్థ్రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్కు సన్మానం



నిజామాబాద్ నాగారం : జిల్లాకు కలెక్టర్ నారాయణరెడ్డి వచ్చి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వైద్యశాఖ ఆధ్వర్యంలో డీఎంహెచ్వో డా.సుదర్శనం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే దుబ్బ పీహెచ్సీకి నేషనల్ అవార్డు వచ్చినందుకు వైద్యాధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో గంగాధర్, గోవర్ధన్, నటరాజన్, శశికళ, భూమన్న, వినోద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రసేనా రెడ్డి సేవలు మరువలేనివి



ఖలీల్వాడి : న్యాయ సేవా సంస్థలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ వంచ చంద్రసేన రెడ్డి సేవలు మరువలేనివని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్పర్సన్ సునీత కుంచాల అన్నారు. కామారెడ్డికి పదోన్నతిపై సూపరింటెండెంట్గా వెళ్తున్న సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎక్కడ ఉద్యోగం చేసినా అక్కడ చేసిన సేవలతోనే గుర్తింపు వస్తుందన్నారు. సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, సూపరింటెండెంట్ పురుషోత్తంగౌడ్, ప్యానల్ న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేదార్, మాణిక్ రాజ్, ఆశనారాయణతో కలిసి చంద్రసేన్రెడ్డిని సన్మానించారు.

కౌమారదశలో మార్పులపై అవగాహన సదస్సు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలంలోని ఆలూర్, దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శనివారం వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కౌమారదశలో కలిగే మార్పులపై అవగాహన కల్పించారు. హెచ్ఎం హరిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నేతల అరెస్టు

బోధన్టౌన్(బోధన్): ప్రగతి భవన్ ముట్టడికి తరలివెళ్లనున్న యూత్ కాంగ్రెస్ నాయకులను శనివారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, పీఎస్కు తరలించారు. అరెస్ట్ అయినవారిలో మైనార్టీసెల్ జిల్లా వైస్చైర్మన్ సాజిద్ తదితరులున్నారు.

క్యాష్ ఇన్సెంటివ్ చెక్ల పంపిణీ



డిచ్పల్లి : మండలంలోని ధర్మారం(బి) గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 2020–2021లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు ఆర్.శిరీష (ఐఐటీ, మద్రాస్), బి.గంగోత్రి (ఐఐటీ, భువనేశ్వర్) సీట్లు సాధించారు. గురుకుల విద్యాలయాల సంస్థ (సొసైటీ) ద్వారా వచ్చిన నగదు ప్రోత్సాహం రూ.50 వేల చెక్కును శనివారం కళాశాల ప్రిన్సిపాల్ బి.సంగీత ఇద్దరు విద్యార్థినులకు అందజేశారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు



ఇందల్వాయి : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల గన్నారం విద్యార్థులకు శనివారం ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్సనాలిటీ డెవలప్మెంట్పై విద్యార్థులకు ఆర్మూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాయ్స్ ఆంగ్ల ఉపాధ్యాయులు నీరడి దత్తాత్రి టైమ్ మేనేజ్మెంట్, విజయం పొందిన వారి వివరాలను తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.